సాక్షి ప్రకాశం
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



**యూరియా కట్టాలు!**
సాగర్ పరివాహక ప్రాంత రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. ఆర్ఎస్‌కేలు, ఎరువుల దుకాణాలు, సొసైటీల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. - 8లో..




**శాంతిభద్రతల్లో నిర్లక్ష్యం.. సివిల్ సెటిల్మెంట్లు బ్రహ్మాండం!**
తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు మహిళ విషయంలో పోలీసులు స్పందించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /26

**వాతావరణం**
ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. బలమైన గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ‘ఛలో మెడికల్ కాలేజ్’ విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మార్కాపురంలో జరిగే ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులు డాక్టర్లుగా ఎదగాలని, పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి జగనన్న నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేసిందన్నారు. ఈ క్రమంలో మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్ద శాంతియుతంగా నిరసన తెలిపి తమ గళాన్ని దగా కోరు కూటమి ప్రభుత్వానికి వినిపించి, వారి దోపిడీని అడ్డుకుందామని ఆయన విద్యార్థి, యువజన విభాగాలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9 గంటలకు దేవరాజుగట్టువద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి మార్కాపురానికి బయలుదేరి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు.

### నిమ్జ్ ప్రతిపాదిత భూముల పరిశీలన



ప్రతిపాదిత నిమ్జ్ ప్రాంత మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ, పక్కన ఆర్డీఓ

పామూరు: మండలంలోని మాలకొండాపురం రెవెన్యూలో నిమ్జ్ ప్రతిపాదిత భూములను గురువారం జేసీ ఆర్ గోపాలకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీఐఐసీ ప్రతిపాదనల మేరకు పరిశ్రమల ఏర్పాటుకు 856 ఎకరాల రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డిని అడిగి భూముల వివరాలు తెలుసుకున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు నీటివసతి, రోడ్ కనెక్టివిటీ అంశాలపై అధికారులతో చర్చించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పి.మదన్‌మోహన్, తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### సురక్షిత మందుల వాడకంపై అవగాహన అవసరం




ఔషధాల వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ఒంగోలు టౌన్: సురక్షితమైన మందుల వాడకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసరమైన ఔషధాలను వినియోగించడం సాధ్యమైనంత మేర తగ్గించుకోవాలని సూచించారు. వైద్యుడి సలహా లేకుండా ఎలాంటి ఔషధాలు వినియోగించరాదన్నారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులకు మందుల వాడకంపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ తిరుపతి రెడ్డి, ఫార్మకాలజీ హెచ్ఓడీ చంద్రకళ, ఆర్థోపెడిక్ హెచ్ఓడీ అజయ్, క్విస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

### మరో బార్‌కు డ్రా

ఒంగోలు టౌన్: జిల్లాలో మిగిలిపోయిన నాలుగు బార్లకుగాను గురువారం ఒక బార్‌కు డ్రా తీశారు. కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ చినఓబులేసు డ్రా తీసి లైసెన్స్ కేటాయించారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని ఓపెన్ కేటగిరి బార్‌కు నిబంధనల ప్రకారం నలుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారి సమక్షంలో డ్రా తీసినట్లు ఈఎస్ షేక్ ఆయేషా బేగం తెలిపారు.

# జీభీహెచ్..!

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్) అవినీతికి కేంద్రంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ నేతల జోక్యంతో కొంతమంది అధికారులు, సిబ్బంది అవినీతికి తెరతీశారు. అందిన కాడికి నొక్కేస్తున్నారు. కోరిన సమయం, కావాల్సిన డ్యూటీలు వేయించుకునేందుకు భారీగా ముడుపులు చెల్లించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎంఓ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఇక్కడ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, మారో అధికారి కలిసి చక్రం తిప్పుతున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేట్ ఫిక్స్ చేసి జీజీహెచ్‌కు వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం. ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా మద్యం పంపిణీ చేసిన వారు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా మారి అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



- సర్వజన ఆస్పత్రిలో పెరిగిపోతున్న అవినీతి
- రోగులకు వైద్య సేవల కన్నా ముడుపులే ముఖ్యం
- ఆర్ఎంఓ ఆఫీసుపైనా ఆరోపణలు
- సర్టిఫికెట్ కావాలంటే నైవేద్యం చెల్లించుకోవాల్సిందే
- చక్రం తిప్పుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- అనుమతులు లేకుండానే క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు

సాక్షి టాస్క్ ఫోర్స్:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి ప్రతి రోజూ 800 నుంచి 1200 మంది వరకూ రోగుల తాకిడి ఉంటుంది. అలాగే వివిధ సర్టిఫికెట్ల కోసం వందల సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ ఓపీ నుంచే వారికి కష్టాలు ప్రారంభమవుతున్నాయి. రోగులకు సేవలందించాల్సిన సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిన డాక్టర్లు జూనియర్లకు అప్పజెప్పి ప్రైవేట్ వైద్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొంతమంది నర్సింగ్ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకుండా ట్రైనీ నర్సింగ్ స్టాఫ్‌తో పనులు చేయిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్పత్రిలో రాజకీయాలు, అవినీతి పెరిగిపోయిందన్న విమర్శలున్నాయి.

**ఆర్ఎంఓ కార్యాలయంలో ఏం జరుగుతోంది..?**

ఆస్పత్రిలో ఆర్ఎంఓ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ పాలనలో ఆర్ఎంఓ కార్యాలయంలో కేవలం ఆర్ఎంఓ మాత్రమే ఉంటూ విధులు నిర్వహించేవారు. ఏడాదిన్నర కాలంగా ఆర్ఎంఓ కార్యాలయంలోనే డీఆర్ఎంఓ తిష్ట వేశారు. ఆయనతో పాటుగా మెడికల్ కాలేజీకి చెందిన ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కూడా అక్కడే ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం ఇక్కడకు వస్తుంటారు. బర్త్ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. ఒక్కో సర్టిఫికెట్‌కు ఒక్కో రేటు ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. పైసలు చేతిలో పడనిదే ఏ ఒక్కరికి కూడా సంబంధిత సర్టిఫికెట్లు చేతికి ఇవ్వరని చెప్పుకుంటున్నారు. ఉద్యోగుల డ్యూటీల విషయంలో కూడా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అయినా ఆర్ఎంఓ కార్యాలయంలో మిగతా సిబ్బందికి పనేంటని అడిగే వారే లేకుండా పోయారని ఇక్కడకు వచ్చే రోగులు ప్రశ్నిస్తున్నారు.

**ఎమ్మెల్యే గన్‌మెన్‌కు క్యాంటీన్**

జీజీహెచ్‌ను అధికార పార్టీ ఎమ్మెల్యేలు పంచుకొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని హాస్టల్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీనియర్ ఎమ్మెల్యే గన్‌మెన్‌కు కాంట్రాక్ట్ ఇచ్చినట్లు సమాచారం. అదే కాలేజీలోని బాలికల హాస్టల్‌ను ఒంగోలు టీడీపీ మహిళా నాయకురాలికి అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆస్పత్రి ఆవరణలో వున్న క్యాంటీన్లకు కూడా ఎలాంటి అనుమతులు లేవని సమాచారం. అధికార పార్టీ బరితెగించి అవినీతికి పాల్పడుతోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**చక్రం తిప్పుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు**

కూటమి ప్రభుత్వం రాగానే ఒంగోలులోని టీడీపీ నాయకులు జీజీహెచ్‌పై కన్నేశారు. గత ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ చేసినట్లు అరోపణలు ఉన్న ముగ్గురికి కీలక విభాగాల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా నియమించుకుని అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ముగ్గురిలో ఇద్దరు 2014–19లో టీడీపీ పాలనలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ద్వారా ఉద్యోగంలో చేరి ప్రస్తుతం ఆప్కాస్‌లో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

**భారీగా వసూళ్లు.. ఉన్నతాధికారుల విచారణ**

జిల్లా కేంద్రమైన ఒంగోలులో మూడంతస్తుల భవనంలో నిర్వహించే ఈ బోధనాసుపత్రిలో రోగులకు వైద్య సేవలు అందించేందుకు 700 మందికి పైగా నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరికి నెలకోసారి రోస్టర్ ప్రకారం డ్యూటీలు వేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు మూడు షిఫ్ట్‌లుగా విభజించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు రెండో షిఫ్ట్, రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మూడో షిఫ్ట్. నెలకోసారి డ్యూటీలు మారుతుంటాయి. అయితే కొందరు నర్సులు తమకు అనువైన సమయంలో డ్యూటీ వేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నర్సుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ఇన్‌చార్జి ముడుపులు వసూళ్లకు పాల్పతున్నట్లు తెలుస్తోంది. ఒక్క డ్యూటీల విషయంలోనే కాకుండా సిబ్బందికి సెలవులు కావాలన్నా, బదిలీలపై వెళ్లే వారిని రిలీవ్ చేయాలన్నా నైవేద్యం చెల్లించాల్సిందేనని జీజీహెచ్‌లో చెప్పుకుంటున్నారు. ఇటీవల ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లింది. దీనిపై ఉన్నతాధికారులు రెండు రోజులపాటు విచారణ కూడా చేశారని తెలిసింది.

## హైదరీ క్లబ్ భూ కబ్జాపై డీఆర్ఓ విచారణ

- రూ.100 కోట్ల విలువైన వైద్య విధాన పరిషత్ స్థలం కబ్జా చేసిన క్లబ్ కమిటీ
- కార్పొరేషన్ అనుమతి లేకుండానే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం
- ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో అధికారుల విచారణ



అధికారులను విచారిస్తున్న డీఆర్ఓ ఓబులేసు

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు సబర్బన్: నగరంలో హైదరీ క్లబ్ నిర్వాహకులు రూ.100 కోట్ల విలువైన వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ స్థలం కబ్జాపై జిల్లా రెవెన్యూ అధికారి బీసీహెచ్ ఓబులేసు గురువారం విచారణ చేపట్టారు. ప్రకాశం భవన్‌లోని డీఆర్ఓ చాంబర్‌లో ఒంగోలు నగర ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులను ఆయన విచారించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కార్పొరేషన్ అనుమతి ఇవ్వకపోయినా హైదరీ క్లబ్ అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టింది. దీనిపై సాక్షి దినపత్రికలో గత నెల 24న ‘కబ్జా విస్తరిస్తూ...కార్పొరేషన్ విస్మరిస్తూ’ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఆధారంగా పట్టణ ప్రజా సంఘాల నేతలు ఈ నెల 8వ తేదీన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా రెవెన్యూ అధికారి హైదరీ క్లబ్ వారికి నోటీసు ఇచ్చి ఆ కాపీని ప్రజా సంఘాలకు కూడా పంపించారు. ప్రజా సంఘాల సమక్షంలో సర్వే చేసి పూర్తిస్థాయి విచారణ నివేదికను వారం రోజుల్లో ఇవ్వాలని రెవెన్యూ, ఒంగోలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేసినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారన్నారు. అక్రమ నిర్మాణం కాంప్లెక్స్ శంకుస్థాపనకు అధికారులు హాజరు కావడం దుర్మార్గమన్నారు.

## బాధితులకు భరోసా కల్పించాలి

- జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ హర్షవర్ధన్ రాజు



హాజరైన ఏఎస్పీలు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఒంగోలు టౌన్: సకాలంలో స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్నీ సబ్‌డివిజన్ల పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలు, జిల్లాలో ఎక్కువగా కేసులు నమోదయ్యే ప్రాంతాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పేకాట, కోడి పందేలు, మట్కా, సింగిల్ నెంబర్ లాటరీ వంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులపై నిఘా ఉంచాలని, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలను, దైనందిన జీవన విధానాన్ని పరిశీలించాలని, ఏదైనా అనుమానం వస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాన్నారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నేర నియంత్రణ, పరిశోధన వేగవంతం చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఏదైనా వైరల్ అయిన విషయం పట్ల నిజనిజాలను ప్రకారం నడుచుకోవాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా ఉండాలని, పారదర్శక, నిష్పక్షపాత పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. కీలక కేసులను గుర్తించి వాటిని ప్రాధాన్యత క్రమంలో ట్రయల్స్ జరిపించి నిందితులకు శిక్షలు పడేలా చేయాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఎఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాస రావు, లక్ష్మీనారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, కె.శ్రీనివాసరావు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ ముందు ధర్నా చేస్తున్న పవర్ జేఏసీ నాయకులు

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఒంగోలు విద్యుత్ భవన్ ముందు పవర్ జేఏసీ నాయకుల ధర్నా

ఒంగోలు సబర్బన్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ పవర్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని రాంనగర్‌లో ఉన్న విద్యుత్ భవన్ ముందు గురువారం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ ఓ.బాలాజీ మాట్లాడుతూ కార్మికుల, ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేయాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల ఆరియర్స్ ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఏ.సాయికుమార్, ఒంగోలు డివిజినల్ ప్రెసిడెంట్ విష్ణు మహేశ్వర వర్ధన్, రఫీ, రమణ రెడ్డి, హైమావతి పాల్గొన్నారు.

## 12వ పీఆర్‌సీ ప్రకటించాలి



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

- సీఐటీయూ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా

ఒంగోలు సబర్బన్: 12వ పీఆర్‌సీ ప్రకటించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ నగర కన్వీనర్ టి.మహేష్ మాట్లాడుతూ పీఆర్‌సీ వేతనాలు ఇవ్వాలని, సమ్మెకాలం జీతం ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగులకు, కార్మికులకు డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలకు సంబంధించిన జీఓలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. కరోనా బదిలీ కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, దహన సంస్కారాల ఖర్చు రూ.20 వేలు ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబాలకు రూ.7 లక్షలు ఇవ్వాలని కోరారు.

యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.విజయమ్మ, యు కుమారి, కె.మోహన్‌రావు, ఎం సింహాద్రి, ఎం బాబు, భారతి, జాలమ్మ, కె.ఆనంద్, బి.సుబ్బారావు, అనిత, సునీల్, జి.మధు, ఎస్ రమాదేవి, అంకరాజు తదితరులు పాల్గొన్నారు.




నగరంలో వర్షం కురుస్తున్న దృశ్యం



భాగ్యనగర్ 4వ లైన్ 6వ అడ్డరోడ్డులో భారీగా నిలిచిన నీరు



## జిల్లా వ్యాప్తంగా వర్షాలు

జిల్లా వ్యాప్తంగా గురువారం వర్షం కురిసింది. టంగుటూరు, దర్శి, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లో భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో మధ్యాహ్నం భారీ కురిసింది. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారుల్లో వర్షంనీరు నిలిచింది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, బాపూజీ కాంప్లెక్స్ ఎదుట, జీజీహెచ్ ఎదుట పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి చెరువులను తలపించాయి. శివారు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు కొంతమేర బయటకు వచ్చే వీలు లేక ఇబ్బందులు పడ్డారు.

– ఒంగోలు సబర్బన్



## జాతీయస్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపిక

ఒంగోలు: జాతీయస్థాయి రోల్‌బాల్ పోటీలకు ఒంగోలుకు చెందిన పిక్కిలి వరుణ్ ఎంపికయ్యారు. ఇటీవల చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ నేషనల్ రోల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రాజట్టు తరఫున అండర్ 11 బాలుర విభాగంలో పిక్కిలి వరుణ్, బాలికల విభాగంలో పి.సిదీక్షలు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో వరుణ్ సత్తాచాటి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకోవడం ద్వారా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వరుణ్‌ను స్థానిక రవితేజ చెస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సుబ్బానాయుడు దంపతులు ఆర్థికసాయం అందించి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలని వారు ఆశీర్వదించారు. కార్యక్రమంలో కోచ్ అనీల్‌కుమార్, రోల్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి ఎ.అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 'జాళ్లపాలెం ఘటన' తదుపరి చర్యలపై హైకోర్టు స్టే

కొండపి: మండలంలోని పెద్ద కండ్లకుంట పంచాయతీ జాళ్లపాలెం గ్రామంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన రచ్చబండను, 30 ఏళ్ల నుంచి ఉన్న చెట్టు, మంచినీటి బోరింగ్‌ను టీడీపీ సానుభూతిపరుల ప్రోద్బలంతో, పోలీసుల సహకారంతో కూల్చిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు పోలీసులను ప్రశ్నించగా అక్రమ కేసులు బనాయించారు. ఈ కేసులపై బాధితులు హైకోర్టును ఆశ్రయించగా తదుపరి ఎటువంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ స్టే విధించినట్లు సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ తెలిపారు. బాధితుల పక్షాన నిలిచి, కేసులపై న్యాయ పోరాటం చేసి, అక్రమ కేసులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు, సర్పంచ్ భువనగిరి సత్యనారాయణకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

### కంభంలో దొంగనోట్ల కలకలం!

కంభం: ఎస్‌బీఐలో ఓ వ్యక్తి నగదు డిపాజిట్ చేస్తున్న సమయంలో దొంగనోట్లను గుర్తించిన బ్యాంకు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అందిన వివరాల మేరకు.. ఈనెల 2వ తేదీ సాయంత్రం సుబ్బారావు అనే వ్యక్తి కంభం ఎస్‌బీఐలో రూ.43,500 డిపాజిట్ చేసేందుకు కౌంటర్‌లో నగదు ఇవ్వగా అందులో 21 ఐదు వందల రూపాయల(రూ.20,500 నగదు) నోట్లు గుర్తించారు. సిబ్బంది బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనంతరం వారి సూచనల మేరకు కంభం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కంభం ఎస్సై నరసింహారావును వివరణ కోరగా బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బ్యాంకులో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన వ్యక్తి ఆ నగదును తనకు మరో వ్యక్తి ఇచ్చిన డబ్బులని చెబుతున్న నేపథ్యంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి



మృతి చెందిన రాకేష్

పెద్దదోర్నాల: బైక్ అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కర్నూలులోనిఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం శ్రీశైలం ఘాట్ రోడ్డులో సంభవించిన ప్రమాదంలో నందికొట్కూర్‌కు చెందిన రాకేష్ తీవ్రంగా గాయపడిన విషయం పాఠకులకు విదితమే. రాకేష్‌కు దోర్నాల వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కర్నూలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాకేష్ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఆయన బంధువులు తెలిపారు. మృతుడు కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో ప్రైవేట్ స్కూల్ వ్యాన్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

### పిచ్చికుక్క దాడిలో 19 మందికి గాయాలు

అర్ధవీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 19 మందిని కరిచి గాయపరిచింది. అర్ధవీడు, దొనకొండ, చీమలేటిపల్లి, వీరభద్రాపురం గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి తిరుగుతున్న పిచ్చికుక్క కనిపించిన వారినందరినీ కసిగా కరిచింది. క్షతగాత్రులు అర్ధవీడు పీహెచ్‌సీతోపాటు కంభంలోని ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొందారు. వీధి కుక్కల బెడదను కట్టడి చేసేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### 21న సెపక్‌తక్రా జట్ల ఎంపిక

ఒంగోలు: సెపక్ తక్రా జిల్లా జట్లఎంపిక పోటీలు ఈనెల 21న సాయంత్రం 3 గంటలకు స్థానిక ఏబీఎం కాలేజీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి డి.రవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్స్ పురుషులు, మహిళల విభాగంలో ఎంపిక పోటీలకు ఆసక్తి ఉన్న వారు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జట్లు ఈ నెల 27, 28వ తేదీల్లో ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9381657774ను సంప్రదించాలని సూచించారు.

### 21న వాలీబాల్ జిల్లా ప్రాబబుల్స్ జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా వాలీబాల్ సబ్ జూనియర్, జూనియర్ బాలుర ప్రాబబుల్స్ జట్లను ఈనెల 21న స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేయనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.ఆంజనేయులు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఎంపిక ప్రదేశంలో హాజరుకావాలని స్పష్టం చేశారు. వివరాలకు 9490196274ను సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో సూచించారు.

# యూరియా కట్టాలు!



అబ్బో మోతబరువు..



సాగర్ పరివాహక ప్రాంత రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ రైతు భరోసా కేంద్రంలోనే లభ్యమైన యూరియా.. నేడు అంత సులువుగా దక్కడం లేదు. ఆర్‌ఎస్‌కేలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలు, సొసైటీ కార్యాలయాల చుట్టూ రైతులు చక్కర్లు కొడుతున్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద రూ.260 విలువైన యూరియా బస్తాను ఇప్పటికీ రూ.100 వరకు అదనంగా చెల్లించి రైతులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. సొసైటీలు, ఆర్‌ఎస్‌కేల్లో ఒక్కో రైతుకు ఆధార్‌పై 3 బస్తాలు యూరియా మాత్రమే ఇస్తుండటంతో రైతులకు అదనపు భారం తప్పడం లేదు. ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన రైతులను యూరియా కోసం వెంపర్లాడేలా చేస్తోంది. జిల్లాలో సాగర్ పరివాహక మండలాలైన పుల్లలచెరువు, త్రిపురాంతకం, కురిచేడు, దొనకొండ, తాళ్లూరు, దర్శి, చీమకుర్తి పరిధిలోని గ్రామాల్లో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. వరి, మిర్చితోపాటు ఇతర పంటలకు యూరియా అవసరం ఎక్కువగా ఉండటంతో అందినచోట కొనుగోలు చేసేందుకు రైతులు క్యూకడుతున్నారు.

- సాక్షి, ఒంగోలు





ఆటోలు, రిక్షాలు బాడుగకు మాట్లాడుకుని అరకొరగా ఇచ్చిన యూరియా తరలింపు



విశ్వనాథపురం సొసైటీ కార్యాలయం వద్ద రైతుల క్యూ





బైకులు, స్కూటర్లపై యూరియా బస్తాలతో..

# శాంతిభద్రతల్లో నిర్లక్ష్యం.. సివిల్ సెటిల్మెంట్లు 'బ్రహ్మ'ండం!

- తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు ఘటనలో స్థానిక పోలీసుల నిర్లక్ష్య వైఖరి
- మహిళపై భర్త పాశవిక దాడిపై సమాచారం ఇచ్చినా స్పందించని వైనం
- డయల్ 112కు ఫిర్యాదు చేయడంతో ఇలా వచ్చి అలా వెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్లు
- రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కావడంతో మహిళకు న్యాయం చేస్తామంటూ ప్రకటనలు
- వీడియో వెలుగులోకి రాకపోతే బాధిత మహిళకు తీరని అన్యాయం
- సివిల్ పంచాయతీల్లో మునిగితేలుతున్నారంటూ స్టేషన్ అధికారిపై తీవ్ర ఆరోపణలు




తర్లుపాడు:

రాష్ట్రంలో శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీస్ వ్యవస్థ తీరు సరిగా లేదని మరింత మెరుగుపడాలని రెండు రోజుల క్రితం కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా వెల్లడించిన విషయం తెలిసిందే. సీఎం మాటలు ఏమాత్రం అవాస్తవం కాదని తర్లుపాడు మండల పోలీసులు నిరూపించారు. వివరాల్లోకి వెళ్తే.. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడుకు చెందిన మహిళ భాగ్యలక్ష్మిని ఆమె భర్త తాళ్లతో కట్టేసి విచక్షణా రహితంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ ఘటనపై స్థానిక పోలీసులు స్పందించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు ఫిర్యాదు అందినప్పటికీ వీడియో వెలుగులోకి వచ్చేదాక పోలీసులు కనీస చర్యలు తీసుకోలేదు. ఏం జరిగిందో కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. గత శనివారం రాత్రి భర్త తాళ్లతో నిర్బంధించి భాగ్యలక్ష్మిని హింసించాడు. సోమవారం రాత్రి మరో మారు అపహరించి హింసించేందుకు భాగ్యలక్ష్మి నివశిస్తున్న ఇంటివద్దకు రాగా వారిని గమనించిన ఆమె తప్పించుకుని పక్కనే ఉన్న ఎస్సీకాలనీలోని పరిగెత్తింది. ఈ క్రమంలో స్థానికంగా ఉండే కొందరు యువకులు బాలాజీని హెచ్చరించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆమె ఆవేదనను తెలుసుకున్న స్థానిక ప్రజా ప్రతినిధి తర్లుపాడు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఎంతసేపటికీ వారు రాకపోవడంతో చర్చి వద్ద ఉన్న కొందరు యువకులు ఏం జరిగిందంటూ బాధిత మహిళను ఆరా తీశారు. తన భర్త చంపేందుకు ప్రయత్నిస్తున్నాడని, నా పిల్లలు అనాథలైపోతారని ఆ మహిళ కన్నీరుమున్నీరుగా విలపించింది. దీంతో ఆ యువకులు డయల్ 112కు సమాచారం అందించారు. రాత్రి 11 గంటల సమయంలో తర్లుపాడు పోలీసుస్టేషన్‌నుంచి వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లు మహిళతో మాట్లాడి ఫొటో దిగి బాలాజీ మేనల్లుడు విష్ణును బైక్‌పై ఎక్కించుకుని కొంత దూరం తీసుకెళ్లి వదిలేశారు. ఓ మహిళపై క్రూరంగా దాడి చేసినప్పటికీ మరుసటిరోజు ఉదయం కూడా దృష్టి సారించలేదు. పైశాచిక ఆనందం పొందేందుకు బాలాజీ మరో భార్యగా చెబుతున్న మహిళ తీసుకున్న వీడియో మంగళవారం సాయంత్రం బయటకు రావడంతో వాస్తవాలు వెలుగుచూశాయి. భాగ్యలక్ష్మిపై జరిగిన హింసను వీడియోలో చూసిన వారంతా ఆవేదనకు గురయ్యారు.

**తర్లుపాడు ఠాణా.. భరోసా దక్కేనా?**

గత కొంతకాలంగా తర్లుపాడు పోలీసుస్టేషన్ సివిల్ పంచాయితీలకు అడ్డాగా మారినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారులతో సిబ్బంది సైతం అమర్యాదగా మాట్లాడుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని రాగసముద్రం గ్రామంలో ఓ సివిల్ కేసులో ఎస్సై తలదూర్చి బాధితులను బెదిరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించి న్యాయం పొందారు. జగన్నాథపురంలో పలు సివిల్ కేసుల్లో ఎస్సై తలదూర్చి బాధితులను బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. మీర్జపేటలో ఎస్సీ యువకుడిపై దాడి ఘటనలో బాధితులపైనే కేసు పెడతాననడంతో ఖంగుతిన్న యువకులు కేసు విత్‌డ్రా చేసుకోగా.. దాడికి పాల్పడిన వారి నుంచి లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి. వినాయకచవితి సందర్భంగా యాదవ బజారులో యువకుల మధ్య జరిగిన గొడవలో బాధితులకు న్యాయం జరగలేదన్న చర్చ నడుస్తోంది. వీటికి తోడు పలు కుటుంబ గొడవల్లో స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం దక్కకపోవడంతో పోలీసుస్టేషన్ ఛాయలకు వచ్చేందుకు బాధితులు భయపడుతున్నారు. ఉన్నతాదికారుల పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగా ఉండటంతో స్టేషన్ సిబ్బంది ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నట్లు సర్వత్రా చర్చ జరుగుతోంది.

# జేసీ క్షమాపణలు చెప్పాలి

- పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టరు రోణంకి గోపాలకృష్ణ పంచాయతీ కార్యదర్శిని ఏకవచనంతో అత్యంత చులకనగా చాలా దారుణంగా మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖను కూడ అవమానించినారంటూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ప్రతినిధులు ఒకప్రకటనలో తప్పుపట్టారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వర్ల శంకర్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి ముదినేని కొండలు, ఉపాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, సంగమేష్, విజయ్, నాగరాజు, నాగేశ్వరావు, శ్రీనివాసులు గురువారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ పంచాయతీ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి ఎవరికి పనిలేదు ఒక శాఖ వాళ్లే పని చేస్తున్నారు అన్నట్లుగా వ్యాఖ్యలు చేశారని తప్పుపట్టారు. గ్రామ సచివాలయం విధులతో పాటు కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు, ప్రభుత్వం చేప్పే నిరంతర సర్వేలతో పంచాయతీ కార్యదర్శి ఉదయం 6 నుంచి రాత్రి ఏ సమయానికి ఇంటికి చేరుతారో తెలియని పరిస్థితిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ×ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టరు వ్యాఖ్యలతో మా మనోభావాలు దెబ్బతిన్నాయి. దీనిని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శులు సమాఖ్య తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. జేసీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇటువంటి పరిస్థితులు మరలా రాకుండా తగిన విధంగా స్పందించాలని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి - పంచాయతీరాజ్, అటవీ -పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ల₹ను విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. ఆ జాయింట్ కలెక్టరు క్షమాపణ చెప్పని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతాం అంటూ హెచ్చరించారు.

# నివాసంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

- మంటలు చెలరేగి సామగ్రి దగ్ధం.. రూ.4 లక్షలు ఆస్తి నష్టం
- ముండ్లమూరు మండలం పలుకురాళ్ల తండాలో ఘటన



కాలిన వంట సామగ్రి



దగ్ధమైన గృహోపకరణాలు

ముండ్లమూరు(దర్శి): విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్ కావడంతో నివాసంలో మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన ముండ్లమూరు మండలంలోని పలుకురాళ్ల తండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు బుక్యా హనుమంతరావు నాయక్ కథనం మేరకు.. గురువారం రాత్రి మొదలైన వర్షం రెండు గంటలపాటు తెరిపివ్వలేదు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం వెలిసిన అనంతరం హనుమంతురావు కుటుంబ సభ్యులంతా ఆరుబయటకు వచ్చారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా కాగా, తీగలు షార్ట్ సర్క్యూటై మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఎగసిపడి విద్యుత్ మీటరుతో సహా ఇంట్లోని ఫ్రిజ్, టీవీ, బీరువా, వివిధ ధ్రువీకరణ పత్రాలు దగ్ధమయ్యాయి. బీరువాలో దాచుకున్న రూ.25 వేల నగదు, రెండు సవర్ల బంగారు ఆభరణాలు కూడా కాలిపోయాయని బాధిత కుటుంబం కన్నీటిపర్యంతమైంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా పరిహారం అందించాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగుల సమస్యలపై కూటమి సర్కారు మొండివైఖరి

- ఏడాదిన్నర నుంచి పరిష్కారం కాని ఆర్థిక పరమైన అంశాలు
- 18 డిమాండ్లలో ఒక్కటీ నెరవేర్చకుండా తాత్సారం
- అక్టోబరు 7న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో విజ్ఞప్తి

ఒంగోలు సిటీ: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని ఫ్యాప్టో నాయకులు పేర్కొన్నారు. మొత్తం 18 డిమాండ్ల పరిష్కారం కోసం అక్టోబర్ 7వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ధర్నాకు అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మీ నారాయణ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన విద్యారంగ, ఆర్థిక పరమైన డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చి 15 నెలలు గడచినప్పటికీ పట్టించుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో గత ఆగస్టు 2వ తేదీన ఫ్యాప్టో పిలుపు మేరకు 18 డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరి వీడలేదని మండిపడ్డారు. ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మలి దశ పోరాటంగా అక్టోబర్ 7వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్న విధంగా దసరా సెలవులను ఈ నెల 22 నుంచి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సాంకేతికతతోనే సైబర్ నేరాలకు చెక్

- ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు



ఐటీ కోర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఒంగోలు టౌన్: సోషల్ మీడియాకు సంబంధించిన విషయాలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలను సాంకేతికత సహాయంతో ఛేదించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చన్నారు. గురువారం పోలీసు ఐటీ కోర్, కంట్రోల్ రూం సెంటర్లను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం అందించేందుకు ఐటీ కోర్ కృషి చేయాలన్నారు. కంట్రోలు రూంలో విధులు నిర్వహిస్తున్న డయల్ 112 సిబ్బంది అంకితభావంతో చురుగ్గా పనిచేయాలన్నారు. పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి దర్యాప్తునకు ఉపయోగపడే కీలక ఆధారాలను త్వరితగతిన అందించాలని స్పష్టం చేశారు. ఎస్పీ వెంట ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## అట్రాసిటీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

ఉలవపాడు: ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడికి కోర్టు శిక్ష విధించింది. మండల పరిధిలో 2020లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడికి ఒంగోలు ఏడో ఏడీజే కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధించినట్లు కందుకూరు సీఐ అన్వర్ బాషా తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఓ ఎస్టీ మహిళ గేదెల మేత కోసం గట్టు మీద వెళ్తున్న సమయంలో కరేడుకు చెందిన నక్కా రమేష్ తన పొలం దగ్గరకు ఎందుకు తీసుకువస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో ఆమె గట్టు మీద కదా వెళ్తున్నా అని సమాధానం చెప్పింది. అయితే రమేష్ ఆమెను కులం పేరుతో దూషిస్తూ చీరపట్టుకుని లాగి చెంపపై కొట్టి పంట కాల్వలో పడేశాడు. స్థానికుల సాయంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం జడ్జి రాజా వెంకటాద్రి తుదితీర్పు వెల్లడించారు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధించారు.

# టైరు పేలి కారు బోల్తా



పది అడుగుల లోతు గుంతలో బోల్తా పడిన కారు





తీవ్రంగా గాయపడిన శివరామయ్య

- పెద్దదోర్నా-శ్రీశైలం రహదారిలో ప్రమాదం
- పల్నాడు జిల్లా పెట్లూరివారిపల్లె వాసులకు తీవ్ర గాయాలు

పెద్దదోర్నాల: వేగంగా ప్రయాణిస్తున్న కారు టైరు బరస్ట్ కావడంతో అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని గుంతలో బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం పెద్దోర్నాల మండల పరిధిలో శ్రీశైలం రహదారిలోని ఈద్గా వద్ద చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా పెట్లూరివారిపల్లెకు చెందిన శివరామయ్య, ఆయన భార్య పద్మ, కుమారుడు రేవంత్, కుమార్తె రోహిణి దైవదర్శనం నిమిత్తం కారులో శ్రీశైలం బయలుదేరారు. పెద్దదోర్నాలలోని ఈద్గా వద్దకు చేరుకోగానే టైరు బరస్ట్ కావడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న 10 అడుగుల లోతు గుంతలో పడింది. ఈ ప్రమాదంలో శివరామయ్య, ఆయన భార్య పద్మ, కుమారుడు రేవంత్, కుమార్తె రోహిణికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో తొలుత స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం నర్సారావుపేటకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీ రక్షణ చట్టం అమలు చేసేదెప్పుడు?

ఒంగోలు వన్‌టౌన్: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి 16 నెలలు అవుతున్నా ఎన్నికల వేళ ప్రకటించిన విధంగా బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయలేదని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీసీలకు ఆశలు చూపి ఓట్లు వేయించుకుని, తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించడం దారుణమని పేర్కొన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి అమలు చేయకపోవడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయమై త్వరలోనే బీసీ సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- జీజీహెచ్‌లో ఆలస్యంగా స్పందించిన అంబులెన్స్ సిబ్బంది

మార్కాపురం: ఒక వివాదంలో మహిళలు తనపై దాడి చేశారని మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం రాత్రి మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన గుట్టమల్ల శివ ఒక వివాదానికి కారణమయ్యాడని మహిళలు దాడి చేశారు. దీంతో శివ మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి హుటాహుటిన మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వెళ్లాలని సూచించారు. అయితే జీజీహెచ్‌లో అంబులెన్స్ ఉన్నప్పటికీ దోర్నాల నుంచి అంబులెన్స్ రావాలని కాలయాపన చేయడంతో కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు శివను రాత్రి 10 గంటల సమయంలో అంబులెన్స్‌లో ఒంగోలు తరలించారు.